

వికారాబాద్: హోలీ సంబురాల్లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



పరిగి: హోలీ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్



తాండూరు: ఆదర్శతులసీనగర్‌లో హోలీ వేడుకలు



వికారాబాద్ నియోజకవర్గం మర్పల్లిలో..



కొడంగల్ నియోజకవర్గం బొంరాస్‌పేటలో ..



కులకచర్ల మండలం ఘనాపూర్‌లో

# రంగుల మయం

- ఘనంగా హోలీ పండుగ
- యువతీయువకుల ఆటపాటలు

రంగుల పండుగ హోలీని వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి గ్రామాలు, పట్టణ ప్రధాన కూడళ్లలో కామదహనం చేశారు. సోమవారం హోలీ జరుపుకున్నారు. యువకులు, పిల్లలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా చిందులేశారు. గ్రామాల్లో లభించే మోదుగ పువ్వులను దంచి చిన్నారులు రంగులుగా ఉపయోగించారు. చిన్న పిల్లలు వాటర్ బాటిళ్లలో రంగులు నింపుకొని ఉత్సాహంగా హోలీ ఆడారు. డప్పులతో ర్యాలీగా బయలుదేరి ఇండ్లకు వెళ్లి రంగులు చల్లుకున్నారు. చిన్నాపెద్దా, స్త్రీ పురుష భేదం లేకుండా పండుగలో పాల్గొన్నారు. తండాలలో లంబాడా మహిళలు, యువకులు ఉత్సాహంగా హోలీ ఆడారు. మహిళలు హోలీ హోలీరే రంగ హోలీ చెమ్మకేలీల హోలీ అంటూ పాడుకుంటూ నృత్యాలు చేశారు. పలు గామాల్లో యువత కోడి గుడ్లు, టమాటలతో పాటు రంగులు వినియోగించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో హోలీ సంబురాలు జరుపుకొన్నారు. వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ హోలీ వేడుకల్లో పాల్గొన్నారు. పరిగి పట్టణంలో జరిగిన హోలీ సంబురాల్లో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎ.సురేందర్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయ కులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఒకరికొకరు రంగులు చల్లుకొని పండుగ శుభాకాంక్షలు తెలియ జేసుకున్నారు.

–న్యూస్‌నెట్‌వర్క్ , నమస్తే తెలంగాణ



ధారూర్ మండలం మోమిన్‌ఖుర్దు గ్రామంలో ..



బషీరాబాద్: కాముని దహనం ..

## అనుమానాస్పద స్థితిలో..

బంజారాహిల్స్, మార్చి 25: అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కమలాపురి కాలనీలోని సత్యసాయి నిగమాగమం నుంచి ఎల్ఐసీ కాలనీకి వెళ్లే రోడ్డులో ఫుట్‌పాత్‌పై సోమవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ఓ వ్యక్తి (60) మృతదేహం గుర్తించిన స్థానికులు.. జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారమిచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మద్యం మత్తులో కిందపడి పోయి చనిపోయాడా..? లేక అనారోగ్యంతో చనిపోయాడా.? అనే విషయంపై పోలీసులు విచారణ చేపట్టారు. మృతుడి వివరాలను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు..


- మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను వేగంగా చేపట్టాలి
- ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, మార్చి 25: పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో ఎటువంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులను ఆదేశించారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని బీహెచ్‌ఈఎల్ ప్రధాన గేట్ నుంచి కల్వరి టెంపుల్ వద్ద ఉన్న రిజర్వాయర్ వరకు రూ. 40 కోట్ల వ్యయంతో చేపడుతున్న మాంజీరా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. స్థానిక ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజీపడకుండా పనులను చేయాలని అధికారులకు సూచించారు. మంజీరా రోడ్డులో పాత పైప్‌లైన్ 1960లో వేయడం వల్ల.. ప్రస్తుతం లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతున్నాయని అన్నారు. లీకేజీల వల్ల రోడ్లు దెబ్బతినడంతో చుట్టు ప్రక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యపై అప్పట్లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లగా తక్షణమే స్పందించి నిధులు కేటాయించారని అన్నారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తీరడం సంతోషంగా ఉందన్నారు. ఇంటింటికి స్వచ్ఛమైన మంచినీరును అందించమే తమ ధ్యేయమన్నారు. పాత పైప్‌లైన్‌ల స్థానంలో కొత్త పైప్‌లైన్ పనులను వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మంచి నీటి పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

## మొక్కు తీర్చుకున్న పరిగి ఎమ్మెల్యే దంపతులు



కులకచర్ల, మార్చి 25: మండల పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర స్వామిని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ముందుగా 108 బిందెలతో అభిషేకం నిర్వహిం చారు. స్వామికి బంగారు కండ్లు , అమ్మవారికి వెండికిరీటం బహూకరిం చారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా విజయం వరించాలని మొక్కుకున్న ఎమ్మెల్యే దంపతులు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు, పూజారులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కులకచర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత వైరంతో బీఆర్ఎస్ నాయకుడిపై హత్యాయత్నం

వికారాబాద్, మార్చి 25 : గ్రామ మాజీ సర్పంచ్‌పై పాత కక్షలు మనస్సులో పెట్టుకుని, అదును కోసం ఎదురు చూస్తున్న వ్యక్తి హోలీ వేడుకల్లో కత్తితో దాడి చేసిన సంఘటన వికారాబాద్ మండల పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ మండలం పులుసుమామిడి గ్రామానికి చెందిన నారేగూడం కమాల్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా ఉన్నారు. అదే విధంగా గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఈ మధ్యనే సర్పంచ్ పదవీ కాలం పూర్తి కాగా కమాల్‌రెడ్డి వికారాబాద్‌లో నివా సం ఉంటూ గ్రామానికి వస్తూ వెళ్తుంటారు. కమాల్‌రెడ్డి సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామా నికి చెందిన కొత్తగడి నాగిరెడ్డికి అతడి భార్య లలిత మధ్య గొడవలు జరిగాయి. లలిత బంధు వులు గత సంవత్సరం గ్రామంలో పంచాయతీ పెట్టారు. సర్పంచ్ కావడంతో గ్రామ పెద్దగా కమాల్‌రెడ్డి వెళ్లి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే నాగిరెడ్డిని మందలించారు. ఆ కోపాన్ని మనసులో పెట్టుకొని సోమవారం హోలీ అదనుగా చూసుకొని ఒక్క సారిగా కత్తితో దాడి చేశాడు. ఆ సమయంలో కమాల్‌రెడ్డి చెయ్యి అడ్డు పెట్టడంతో చేతులకు, మెడకు గాయాల య్యాయి. వెంటనే కమాల్‌రెడ్డిని వికారాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలిం చారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పరామర్శిం చారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## చికిత్సపొందుతూ వ్యక్తి మృతి

పరిగి టౌన్, మార్చి 25 : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్సై సంతోష్‌కుమార్ కథనం ప్రకారం... దోమ మం డల పరిధిలోని బ్రాహ్మణపల్లి పెద్ద తండాకు చెందిన నేనావత్ నరేష్(23) బైక్‌పై పరిగి వస్తుండగా పరిగి సమీపంలోని సాలెపూల బాట తండా సమీపంలో ఎదు రుగా వచ్చిన టిప్పర్ ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో వెంటనే పరిగి సర్కారు దవా ఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి హన్మనా యక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## సైబరాబాద్‌లో బెల్టు షాపులపై

# ఎస్‌ఓటీ దాడులు

### రూ.6.98లక్షల విలువైన మద్యం సీజ్

సిటీబ్యూరో, మార్చి 25 (నమస్తే తెలంగాణ): సైబరాబాద్ పరిధిలో మరో 29 బెల్టు షాపులపై ఎస్‌ఓటీ బృందాలు దాడులు జరిపాయి. ఈ దాడుల్లో రూ.6,98,500వి లువజేసే మద్యంను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అక్రమ డబ్బు, అక్రమ మద్యం రవాణాపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దీనికి తోడు హోళీ పండుగ నేపథ్యంలో ఈ నెల 25 నుంచి 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూడు కమిషనరేట్ల పరిధిలో మద్యం అమ్మకాలను నిలిపి వేశారు. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని మాఫియా గ్యాంగులు అక్రమంగా మద్యం నిలువ చేసుకుని.. బెల్టు షాపుల ద్వారా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీనిపై ప్రత్యేక నిఘా పెట్టిన ఎస్‌ఓటీ పోలీసులు.. గత వారం రోజులుగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో జల్లెడ పడుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే 50కి పైగా బెల్టు షాపులు బయటపడగా.. తాజాగా, మరో 29 బెల్టు షాపులను ఎస్‌ఓటీ పోలీసులు గుర్తించి దాడులు జరిపారు. కమిషనరేట్‌లోని 21 ఠాణాల పరిధిలో 29 బెల్టు షాపులను గుర్తించి, వాటిల్లో రూ.6,98,500 విలువజేసే 635 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అత్యధికంగా బాలానగర్ ఠాణా పరిధిలోనే 11 బెల్టు షాపులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆబ్కారీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కమిషనరేట్ పరిధిలో బెల్టుషాపులు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, దీని వల్ల శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడే పరిస్థితులు ఎదురవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు. గడిచిన నాలుగైదు రోజుల్లోనే రంగారెడ్డి జిల్లా, సైబరాబాద్ పరిధిలో దాదాపు 100 వరకు బెల్టు షాపులను గుర్తించి, అక్రమ మద్యంను సీజ్ చేసినట్లు ఎస్‌ఓటీ అధికారులు తెలిపారు.

# పుచ్చకాయల్లో పోషకాలెన్నో..



షాబాద్, మార్చి 25: వేసవి కాలం వచ్చిదంటే చాలు ప్రజలు పుచ్చకాయలను ఎంతో ఇష్టంగా తింటారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ వీటిపై ఆసక్తి చూపుతారు. రుచిగా, తియ్యగా ఉండే ఈ కాయల్లో ఎన్నో పోషక విలువలున్నాయి. ప్రస్తుతం పుచ్చకాయలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఎండలు ముదురుతున్న తరుణంలో వీటి వ్యాపారం జోరుగా సాగుతోంది.

**ఎండలు ముదురుతున్న తరుణంలో..**

ఎండలు ముదిరి శరీరంలోని ఖనిజలవణాలు బయటకు పోతున్న తరుణంలో పుచ్చకాయ రుచిచూస్తే ఆ మజానే వేరు. ప్రస్తుతం వేసవి ఆరంభం ముందు ఎక్కడ చూసినా పుచ్చకాయలే దర్శనమిస్తున్నాయి. భానుడు తన ప్రతాపం చూపించడం ప్రారంభించడంతో ప్రజలు చల్లదనాన్ని కోరుకుంటూ పుచ్చకాయలపై దృష్టి సారించారు. దాహార్తి వెంటనే తగ్గించే విషయంలో ఇది బాగా పనిచేస్తుండడంతో ఎక్కువ మంది వీటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. సైజును బట్టి రూ. 20 నుంచి రూ. 80 వరకు పలుకుతోంది. పుచ్చకాయల్లో ఔషధ గుణాలు చాలా ఉన్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు. దాహం తీరుస్తుంది. ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. రక్తంలోని అతి వేడిని అణచివేస్తుంది. ఉష్ణతత్వం గలవారు ఎక్కువగా తీసుకుంటే శరీరానికి మంచిది. శరీరంలోని రోగ నిరోధక శక్తి బాగా పెరుగుతుంది. ఈ పుచ్చకాయలో ఉండే నీళ్లు మరే పండులో ఉండవు. ఈ పండ్లు లోపల ఎర్రటి గుజ్జును చూడగానే నోరూరించే పుచ్చకాయలో గ్లుటాసియాన్ అనే శక్తి వంతమైన యాంటీఆక్సిడెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్‌ఫెక్షన్‌లు, జబ్బులు రాకుండా కాపాడుతుంది.

**పుచ్చకాయల్లో ఉండే పోషకాలు..**

పుచ్చకాయల్లో ఉండే పోషకాలు నీరు ..91శాతం, విటమిన్ సి–13 శాతం, ప్రొటిన్స్ –0.6 గ్రాములు, కార్బోహైడ్రేట్స్–7.6 గ్రాములు ఉంటుంది. దీంతో ప్రజలు వేసవికాలంలో పుచ్చకాయలను తినేందుకు ఎక్కువగా ఆసక్తి చూపిస్తారు. దీనికి ఫలితంగా మనిషి ఆరోగ్యంగా ఉండి రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

– డాక్టర్ శ్రీనివాస్, షాబాద్

## బెల్టుషాపులపై పోలీసుల దాడులు

### 312 మద్యం బాటిల్స్ స్వాధీనం




బడంగ్‌పేట, మార్చి 25: గుట్టుచప్పుడు కాకుండా కిరాణా షాపుల్లో మద్యం విక్రస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మీర్‌పేట పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం.. రెండు కిరాణా షాపుల్లో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై పోలీసులు ఏకకాలంలో దాడులు చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 312 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హోలీ పండగ సందర్భంగా మద్యం దుకాణాలు మూసి ఉన్నాయి. దీంతో జిల్లెలగూడలోని సందూటి సురేందర్‌కు సంబంధించిన కిరాణా షాపులో 76 మద్యం బాటిళ్లను గుర్తించారు. నందనవనం కాలనీలోని భారతి ప్రీతి కిరాణం షాపులో 236 మద్యం బాటిళ్లు స్వాదీనం చేసుకున్నారు. వీరిద్దరినీ అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# హైందవ ధర్మాన్ని కాపాడుకోవాలి




సనాతన వేదాంత జ్ఞాన సభలో మాట్లాడుతున్న పీఠాధిపతి పరమ పూజ్య పరిపూర్ణానందగిరి స్వామిజీ

బడంగ్‌పేట, మార్చి 25: మానవుడు మంచి మార్గంలో నడవాలని పీఠాధిపతి పరమ పూజ్య పరిపూర్ణానందగిరి స్వామిజీ అన్నారు. బాలాపూర్ ఆర్‌సీఐ రోడ్డులోని సామల పాపిరెడ్డి గార్డెన్‌లో 98వ సనాతన వేదాంత జ్ఞాన సభలను సోమవారం స్వామీజీలు ప్రారంభించారు. దేవి ఉపవాసకులు బ్రహ్మశ్రీ మురుకుంట్ల రాజేశ్వర శర్మ నేతృత్వంలో నవగ్రహ యజ్ఞం ప్రారంభించారు. అనంతరం శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. మాజీ డీజీపీ కె.అరవింద్ కుమార్‌ను హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్త, కన్వీనర్ కాశెట్టి పాండు గుప్త, మీడియా కన్వీనర్ వెంకటేశ్ గుప్త సన్మానించారు. హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ, మళయాల స్వాముల భక్త బృందం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీలు ప్రసంగిస్తూ హైందవ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందన్నారు. సనాతనం అంటే పరబ్రహ్మ అన్నారు. మంచి మార్గంలో నడుకున్నప్పుడే మంచి జరుగుతుందని స్వామీజీలు పేర్కొన్నారు. ప్రతి మనిషిలో పరమాత్ముడు ఉంటాడన్నారు. మనిషిలోని దుర్గునాలను రూపు మాపి మంచి మార్గంలో నడిపించాలన్నదే సనాతన ధర్మం అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి స్వామీజీలు, పీఠాధిపతులు, హాజరై సందేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ దయాకర్ గుప్త, ఆనంద్ గుప్త, శివకుమార్, ప్రకాశ్ గుప్త, సత్యం గుప్త, శ్రీరాం గుప్త, నార్ల శ్రీనివాస్ గుప్త, తెరటి పల్లి శ్రీనివాస్ గుప్త, స్వామీజీలు, పీఠాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



మాజీ డీజీపీ కె.అరవింద్ కుమార్‌ను సన్మానిస్తున్న హైదరాబాద్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు లక్ష్మణ్ గుప్త, కన్వీనర్ కాశెట్టి పాండు గుప్త, మీడియా కన్వీనర్ వెంకటేశ్ గుప్త

## నేడు బీఆర్ఎస్ సమావేశం

మణికొండ, మార్చి 25: రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి నాయకులు,కార్యకర్తల సమావేశాన్ని నేడు నార్సింగ్‌లోని ఓం కన్వెన్షన్‌లో ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్లు మండల మాజీ ఎంపీ పీ తలారి మల్లేష్ ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అధ్యక్షతన పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌తో పాటు పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నేతలు, నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## మానసిక వికలాంగులకు చేయూత




సాధన ఇనిస్టిట్యూట్ ప్రతినిధులకు చెక్కును అందజేస్తున్న నవద్వీప ఫౌండేషన్ సభ్యులు

కొండాపూర్, మార్చి 25 : మానసిక వికలాంగుల చేయూతకు తమ వంతుగా హైటెక్‌సిటీలోని మైహోం నవద్వీప ఫౌండేషన్ రూ. 6లక్షల ఆర్థిక సాయాన్ని సోమవారం నాచారంలోని సాధన ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్లీ చాలెంజ్‌డ్ హోంకు అందజేసినట్లు ఫౌండేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. మానసిక వికలాంగ చిన్నారులకు ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ నిర్మాణం కోసం ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. సాధన ఇనిస్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణ కోసం 400ల ఎస్ఎఫ్‌టీతో ప్రత్యేక గది నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని మంత రమేశ్ చేతుల మీదుగా చెక్ రూపంలో అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు డాక్టర్ రమణబాబు, డాక్టర్ రామ మోహన్‌రావు, ఆంజనేయులు, శ్రీనివాసరావు, రవి గంటి, వెంకయ్య, వర్ధన్‌రావులు పాల్గొన్నారు.

## పొట్లూరి నాగేశ్వర్‌రావు సేవలు చిరస్మరణీయం



హిమాయత్‌నగర్,మార్చి 25: నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి శ్రామికవర్గం హక్కుల కోసం జీవితాంతం సేవలు అందించిన ఏఐటీయూసీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, కార్మిక నేత పొట్లూరి నాగేశ్వర్‌రావు ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని పలువురు వక్తలు అన్నారు.పొట్లూరి నాగేశ్వర్‌రావు 16వ వర్ధంతి సందర్భంగా సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ ఎన్‌రెడ్డి భవన్‌లో నాగేశ్వర్‌రావు చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ సీనియర్ నేత రత్నాకర్‌రావు,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజ్,రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ,రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ సంఘటిత,అసంఘటిత రంగాల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం అయ్యేందుకు సమ్మెలు,ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు.